చదువు

ఈనాడు హైదరాబాద్ 10
మంగళవారం మే 29, 2018 ■ e-mail: edc@eenadu.in

ప్రపంచాన్ని, ప్రతి మనిషి మనుగడను శాసించేది డబ్బు. అన్ని రంగాలకూ అదే పెట్టుబడి. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ధనం వల్ల అభివృద్ధి కాదంటే అధోగతి. ఈ నేపథ్యంలో అడుగడుగునా అందరి జీవితాలతో ముడిపడిన కరెన్సీ ప్రభావాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది అర్థశాస్త్రం. ఈ విభాగం అర్థమవుతున్న కొద్దీ కిక్ అనిపిస్తుంది. ఉత్పత్తి, సరఫరా, వినియోగం, మిగులు, కొరత, షేర్ మార్కెట్... ఇలా అన్నీ ఆర్థికశాస్త్రం పరిధిలోనివే. వ్యక్తిదైనా, వ్యవస్థదైనా ప్రగతిని పసిగట్టడానికి ఆర్థిక నివేదికలే ఆధారం. ఇంత విస్తృతమైనది కావడం వల్లే ఈ రంగంలో నిపుణులకు ఎప్పటికీ డిమాండ్ ఉంటోంది. ఎకనామిక్స్‌పై పట్టు ఉంటే ప్రభుత్వ విభాగాలు, కార్పొరేట్ కంపెనీలు, కన్సల్టెన్సీలు, బోధన... తదితర ఎన్నో రంగాలు అవకాశాలతో ఆహ్వానం పలుకుతున్నాయి. వాటిని అందుకోవాలంటే అర్థశాస్త్రంలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చేయాలి.

అవకాశాలపై ఆర్థిక అస్త్రం!

ఆసక్తి ఉంటే ఆర్ట్స్ కోర్సుల్లోనూ అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని నిరూపించే సబ్జెక్టుల్లో ప్రధానమైనది అర్థశాస్త్రం. డిమాండ్, సరఫరా సూత్రం ప్రపంచాన్ని నడిపిస్తున్నంత కాలం ఈ శాస్త్రానికి తిరుగులేదు. సోషల్, సైన్స్ విభాగాల మేలుకలయిక ఇది. ఈ సబ్జెక్టులో పట్టు సాధించినవారు ఐఐటీయన్లకు దీటుగా, కొన్ని సందర్భాల్లో వారిని మించి రాణిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ప్రపంచ బ్యాంకుతోపాటు ఇతర ప్రఖ్యాత సంస్థలు, రేటింగ్ ఏజెన్సీల్లో ఉన్నతస్థాయి అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా యూపీఎస్సీ ఏటా నిర్వహించే ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ (ఐఈఎస్), ఆర్‌బీఐ ఉద్యోగ పరీక్షలకు హాజరుకావడానికి వీరికి అర్హత ఉంటుంది.

వివిధ విభాగాలు

అర్థశాస్త్రం పరిధి చాలా విస్తృతమైంది. ఇందులో పలు విభాగాల్లో లోతైన అధ్యయనానికి అవకాశం ఉంది. వాటిలో మైక్రో ఎకనామిక్స్, మ్యాక్రో ఎకనామిక్స్, సెమీమైక్రో ఎకనామిక్స్, ట్రేడ్, స్టాటిస్టిక్స్, మ్యాథమేటిక్స్, మార్కెట్ అండ్ ప్రైస్ మెకానిజం, కన్స్యూమర్ ఛాయిస్, ఎలాస్టిసిటీ, ప్రొడక్షన్ ఫంక్షన్, ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్, ఎకనోమెట్రిక్స్, ఇన్‌పుట్ అవుట్‌పుట్ అనాలిసిస్, ప్రాజెక్ట్ ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ రిసెర్చ్ మెథడ్స్ మొదలైనవి చదువుతారు.

స్పెషలైజేషన్లు

ఎకనామిక్స్‌లో ఎన్నో స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్నేషనల్ ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎకనామిక్స్, లేబర్ ఎకనామిక్స్, ఇండస్ట్రియల్ ఎకనామిక్స్, మ్యాథమేటికల్ ఎకనామిక్స్, బిజినెస్ ఎకనామిక్స్, బ్యాంకింగ్ ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్, డెవలప్‌మెంటల్ ఎకనామిక్స్, హెల్త్ ఎకనామిక్స్, రూరల్ ఎకనామిక్స్, అనలిటికల్ ఎకనామిక్స్, ట్రాన్స్‌పోర్ట్ ఎకనామిక్స్ ఇలా పలు స్పెషలైజేషన్లు ఉన్నాయి. అభ్యర్థులు తమ అభిరుచుల మేరకు వాటిని ఎంచుకొని అధ్యయనం చేయవచ్చు.

దేశవ్యాప్తంగా దాదాపు అన్ని యూనివర్సిటీలు ఎంఏ ఎకనామిక్స్ కోర్సు అందిస్తున్నాయి. ఇంకా పలు ప్రఖ్యాత సంస్థలు రకరకాల స్పెషలైజేషన్లతో అర్థశాస్త్రంపై పీజీ కోర్సులు అందిస్తున్నాయి.

ఐఐటీల్లో!

కొన్ని ఐఐటీలు ఎకనామిక్స్ కోర్సును యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో బోధిస్తున్నాయి. నాలుగేళ్ల బీఎస్ - ఎకనామిక్స్ కోర్సు కాన్పూర్‌లో, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఎకనామిక్స్ కోర్సు ఖరగ్‌పూర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ రెండింటిలో ప్రవేశం జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా లభిస్తుంది. ఐఐటీ రూర్కీ ఎమ్మెస్సీ ఎకనామిక్స్ కోర్సు అందిస్తోంది. ఐఐటీలు నిర్వహించే జామ్ పరీక్ష ద్వారా ఇందులోకి ప్రవేశం లభిస్తుంది. ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీని కాన్పూర్, ఖరగ్‌పూర్, మాండి, పట్నా, గాంధీనగర్, ఇండోర్ ఐఐటీలు అందిస్తున్నాయి.

సెంట్రల్ యూనివర్సిటీల్లో!

ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఎకనామిక్స్‌ను తమిళనాడు, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఎకనామిక్స్‌ను రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ అందిస్తున్నాయి. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్, ఫినాన్షియల్ ఎకనామిక్స్, యాక్చూరియల్ ఎకనామిక్స్, జనరల్ ఎకనామిక్స్, ఎకానామిక్స్‌లలో ఎంఏ కోర్సు అందిస్తోంది. రాజస్థాన్, కశ్మీర్, హరియాణ, జమ్మూ, కేరళ, పంజాబ్, కర్ణాటక, సౌత్ బిహార్ సెంట్రల్ యూనివర్సిటీలు ఎంఏ ఎకనామిక్స్ కోర్సు అందిస్తున్నాయి. రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్రంలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బీఎడ్ కోర్సు అందిస్తోంది.

వీటన్నింటిలోకీ సీయూ సెట్ ద్వారా ప్రవేశం లభిస్తుంది.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంఏ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎకనామిక్స్ కోర్సులను విడిగా అందిస్తోంది. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఎకనామిక్స్ కూడా ఇందులో ఉంది. హెచ్‌సీయూ నిర్వహించే ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రవేశం లభిస్తుంది.

బెంగళూరు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (బేస్) అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఎకనామిక్స్ (ఆనర్స్) కోర్సు అందిస్తోంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నమూనాలో దీన్ని రూపొందించారు. ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదువుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సీయూ సెట్ ద్వారా ప్రవేశం లభిస్తుంది.

క్వాంటిటేటివ్ ఎకనామిక్స్

ఎకనామిక్స్‌లో క్వాంటిటేటివ్ ఎకనామిక్స్‌కి ఎంతో ప్రాధాన్యం ఉంది. అందువల్లే చాలా సంస్థలు ఎమ్మెస్సీ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ పేరుతో కోర్సు నిర్వహిస్తున్నాయి. అయితే ఇందులో రాణించడానికి ఎకనామిక్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫినాన్స్ అంశాలపై పట్టు తప్పనిసరి. ఇది చదివినవారికి కార్పొరేట్ ఉద్యోగాలు వరిస్తున్నాయి. ఎమ్మెస్సీ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ అందించడంలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) కోల్‌కతా, దిల్లీలను విశిష్ట సంస్థలుగా చెప్పుకోవచ్చు. ఈ సంస్థల్లో ఎమ్మెస్సీ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ కోర్సులో చేరినవారికి నెలకు రూ.5000 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. ఏటా క్యాంపస్ నియామకాలు జరుగుతున్నాయి. వివిధ సంఘటనలను ఆర్థిక కోణంలో విశ్లేషించగలగడం, భవిష్యత్తుని ఊహించడం క్వాంటిటేటివ్ ఎకనామిక్స్‌తో సాధ్యమవుతాయి. మైక్రో, మ్యాక్రో ఎకనామిక్స్, ఎకనామెట్రిక్స్, డేటా అనాలిసిస్‌ను ఉపయోగించి ఈ విశ్లేషణలు చేస్తారు. అనలిటికల్ పరిజ్ఞానం, తర్కం, సృజన ఉన్నవారు క్వాంటిటేటివ్ ఎకనామిక్స్‌లో రాణించడానికి అవకాశాలు ఉన్నాయి. బ్యాంకులు, బీమా సంస్థలు, సైంటిఫిక్ రిసెర్చ్, ఆడిటింగ్, కన్సల్టింగ్ సంస్థల్లో వీరికి ఉద్యోగాలు లభిస్తాయి. కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు, బోధన రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఐఎస్ఐ విద్యార్థులను గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లే, క్రిసిల్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, మెకిన్సే, డెలాయిట్, జెన్‌ప్యాక్ట్, ఐసీఐసీఐ బ్యాంకు మొదలైన సంస్థలు ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి. సగటున ఏడాదికి రూ.15 లక్షలకు పైగా ప్యాకేజీతో విద్యార్థులు ఆఫర్ లెటర్లు అందుకుంటున్నారు. కొన్ని సంస్థలు ఎంఏ ఎకనామిక్స్‌లో భాగంగా క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఎకనోమెట్రిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ) ... అప్లైడ్ క్వాంటిటేటివ్ ఫైనాన్స్, యాక్చూరియల్ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎకనామిక్స్, జనరల్ ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ అంశాల్లో పీజీ కోర్సులు అందిస్తోంది. అలాగే ఇందులో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్స్ కోర్సు కూడా ఉంది.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ (ఎంబీఈ)

కొన్ని బీ స్కూల్స్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ (ఎంబీఈ) పేరుతో కోర్సు అందిస్తున్నాయి. ఉత్పత్తి, శ్రామికులు, క్యాపిటల్ మార్కెట్ అంశాలను ప్రధానంగా జోడించి ఈ కోర్సు అందిస్తున్నారు. ఎకనామిక్స్, కామర్స్, ట్రేడింగ్ అంశాలు ఇందులో ఉంటాయి. ట్యాక్స్ స్ట్రాటజీ, ఇంటర్నేషనల్ బిజినెస్ మొదలైనవి ప్రధాన సబ్జెక్టులు. వీరికి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, ఫైనాన్షియల్ మేనేజర్ హోదాలతో ఉద్యోగాలు లభిస్తాయి. దిల్లీ యూనివర్సిటీ, లఖ్‌నవూ యూనివర్సిటీ, ఐఐఎం అహ్మదాబాద్, కొచిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మొదలైన చోట్ల ఈ కోర్సు అందిస్తున్నారు.

పలు కొలువులు

అర్థశాస్త్ర పరిజ్ఞానం, ఆంగ్ల భాషా సామర్థ్యం ఉంటే బహుళజాతి కంపెనీల్లో కొలువులు సులువుగా సొంతం చేసుకోవచ్చు. పరిశోధకులు, విశ్లేషకులు, ఆర్థిక సలహాదారు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, వెంచర్ క్యాపిటలిస్ట్, ఆడిటర్, స్టాక్ బ్రోకర్, మీడియా విశ్లేషకుడు, బిజినెస్ జర్నలిస్ట్ తదితర హోదాలతో ఉద్యోగాలు పొందవచ్చు. బోధనా రంగంలో రాణించడానికి ఎకనామిక్స్‌లో బీఏ పూర్తయిన తర్వాత బీఈడీ పూర్తిచేసి సోషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం పోటీ పడవచ్చు. ఎంఏ ఎకనామిక్స్ అర్హతతో జూనియర్ కళాశాలల్లో లెక్చరర్‌గా స్థిరపడొచ్చు. యూజీసీ నెట్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ప్రయత్నించవచ్చు. బిజినెస్ స్కూళ్లు, ఎంబీఏ కళాశాలల్లోనూ ఎకనామిక్స్ పోస్టు గ్రాడ్యుయేట్లకు అవకాశాలుంటాయి. పీహెచ్‌డీ చేసి ఉంటే బోధన, పరిశోధన, కన్సల్టెన్సీ రంగాల్లో ఉద్యోగాలు ఉంటాయి.

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఆర్థిక రంగంలో పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఇంజినీరింగ్ కంపెనీలు, బీమా సంస్థలు, తయారీ సంస్థలు, ప్రకటనా సంస్థలు, మీడియా, రిటైల్ ...ఇలా భిన్న రంగాలకు చెందిన సంస్థల్లోని పలు విభాగాల్లో అర్థశాస్త్ర నిపుణులకు అవకాశాలు ఉంటాయి.

యూపీఎస్సీ నిర్వహించే ఐఈఎస్ పరీక్షకు ఎకనామిక్స్, అప్లయిడ్ ఎకనామిక్స్, బిజినెస్ ఎకనామిక్స్, ఎకనామెట్రిక్స్‌లో ఎందులోనైనా పీజీ చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎంపికైనవారు గ్రూప్-ఎ ఆఫీసర్ గా కేంద్రప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తారు. అలాగే ఆర్‌బీఐలో గ్రేడ్-బి ఉద్యోగాల్లో కొన్నింటికి ఎకనామిక్స్‌లో పీజీ చదివినవారే అర్హులు. వీటికి సంబంధించిన ప్రకటనలు దాదాపు ఏటా వెలువడుతున్నాయి.

జాతీయ స్థాయిలో పేరున్న సంస్థలు

- జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూదిల్లీ
- దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, న్యూదిల్లీ
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ
- ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ కోల్‌కతా, న్యూదిల్లీ
- జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ, న్యూదిల్లీ
- గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్, పుణే
- మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ), చెన్నై
- బెనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాసి
- ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రిసెర్చ్ (ఐజీడీఆర్), ముంబయి
- సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ (సీడీఎస్), తిరువనంతపురం
- బిట్స్ - పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో ఆనర్స్ విధానంలో ఎమ్మెస్సీ ఎకనామిక్స్ కోర్సు అందిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో...

- ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు
- శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి
- శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం
- డా.బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం

తెలంగాణలో...

- ఉస్మానియా యూనివర్సిటీ
- కాకతీయ యూనివర్సిటీ

ఈ యూనివర్సిటీలకు అనుబంధంగా ఉన్న పలు ప్రైవేటు కళాశాలల్లోనూ ఎంఏ ఎకనామిక్స్ కోర్సును బోధిస్తున్నారు. ఆయా యూనివర్సిటీలు నిర్వహించే పీజీ సెట్ల ద్వారా వాటిలోకి ప్రవేశం లభిస్తుంది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

హెవీ వాటర్ బోర్డులో 230 ఖాళీలు

ముంబయిలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన హెవీ వాటర్ బోర్డ్ దేశవ్యాప్తంగా ఉన్న వివిధ హెవీ వాటర్ ప్లాంట్లలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: స్టైపెండరీ ట్రైనీ, టెక్నీషియన్, అప్పర్ డివిజన్ క్లర్క్ తదితరాలు.

ఖాళీలు: 230 **అర్హత, వయసు:** బోర్డు నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్

దరఖాస్తు ఫీజు: రూ.100

చివరి తేది: 25.06.2018

వెబ్‌సైట్: http://www.hwb.gov.in/

ఇండియన్ నేవీ

ఇండియన్ నేవీ 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద ఎజిమళ (కేరళ) నేవల్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత. జేఈఈ మెయిన్-2018కు హాజరై ఉండాలి. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

వయసు: 02 జులై 1999 నుంచి 01 జనవరి 2002 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ ఆల్ ఇండియా ర్యాంకు, తదితర పరీక్షల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తు: 02.06.2018 నుంచి 21.06.2018 వరకు

కోర్సు ప్రారంభం: 2019 జనవరి

వెబ్‌సైట్: https://www.joinindian-navy.gov.in/

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్

పోస్టులు: పర్సనల్ అసిస్టెంట్, అప్పర్ డివిజన్ క్లర్క్ తదితరాలు.

ఖాళీలు: 71

అర్హత: డిగ్రీ, టైపింగ్, షార్ట్‌హ్యాండ్ సామర్థ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం. **ఎంపిక:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్ ద్వారా.

దరఖాస్తు ఫీజు: రూ.300

ఆన్‌లైన్ దరఖాస్తు: 04.06.2018 నుంచి 10.07.2018 వరకు.

వెబ్‌సైట్: https://icmr.nic.in/

దిల్లీ పబ్లిక్ లైబ్రరీలో 17 ఖాళీలు

పోస్టులు: ఎంటీఎస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ తదితరాలు.

ఖాళీలు: 17

అర్హత: పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ బ్యాచిలర్స్ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ, డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం

ఎంపిక: నిబంధనల ప్రకారం.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.300 **చివరి తేది:** ఎంప్లాయిమెంట్ న్యూస్ (26 మే-1 జూన్, 2018)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు. **వెబ్‌సైట్:** http://dpl.gov.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ మీట్

పోస్టులు: జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్, యంగ్ ప్రొఫెషనల్ తదితరాలు.

ఖాళీలు: 04 **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, బీఈ/ బీటెక్, నెట్, పీహెచ్‌డీ, అనుభవం. **ఇంటర్వ్యూ తేది:** 12.06.2018. **వేదిక:** ఐకార్-నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ మీట్, చెంగిచర్ల, హైదరాబాద్-500 092.
https://nrcmeat.icar.gov.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఇందుకే.. ఎంచుకోవాలి ఈసీఈ!

టెలివిజన్, రేడియో, శాటిలైట్, కంప్యూటర్, మొబైల్, ఏసీ ఇలా మన జీవితాలతో ప్రతి క్షణం ముడిపడి ఉండే పరికరాలన్నింటినీ రూపకల్పన చేసి, నిర్వహించేది ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీర్లే. ఆట బొమ్మల నుంచి అంతరిక్షం వరకు అనేక అవకాశాలు కల్పిస్తుంది కాబట్టే, ఎంసెట్ తర్వాత ఈసీఈ బ్రాంచిని ఎంచుకోవచ్చు.

ఇంజినీరింగ్ బ్రాంచీల్లో అత్యంత ఆదరణ ఉన్నవాటిల్లో ప్రముఖమైంది ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్). ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న బ్రాంచి ఇది. ప్రధానంగా ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరికరాలు; సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు; చిప్ లెవెల్ హార్డ్‌వేర్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీల ఇంటర్‌ఫేస్ అధ్యయనం ఈ బ్రాంచిలో ఉంటుంది.

ఈసీఈ బ్రాంచిని ఎంచుకునే ముందు అభ్యర్థి ఆసక్తిని అంచనా వేసుకోవాలి. ఇంటర్‌లో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల్లోని కొన్ని అధ్యాయాలపై అవగాహన ఉంటే ఈసీఈ గురించి అభ్యర్థులు ఆలోచించవచ్చు. బ్రాంచీల వారీగా ఆ అధ్యాయాల వివరాల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఎంసెట్ - ఇంజినీరింగ్ బ్రాంచీలు

ఉద్యోగావకాశాలు

ఈసీఈ డిగ్రీ పట్టా పొందినవారికి బ్రాడ్‌కాస్టింగ్, కన్సల్టింగ్, డేటా కమ్యూనికేషన్, ఎంటర్‌టైన్‌మెంట్, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, సిస్టం సపోర్ట్ వంటి మ్యానుఫాక్చరింగ్ పరిశ్రమలు, సేవా సంస్థల్లో ఉపాధి అవకాశాలుంటాయి. నిజజీవితంలో సమాచారాన్ని చేరవేసే వీడియో కాన్ఫరెన్సింగ్, ఇంటర్నెట్ బ్రాడ్‌కాస్టింగ్ లాంటి ఆధునిక

మల్టీమీడియా సర్వీస్ సంస్థల్లోనూ ఉద్యోగాలు లభిస్తాయి. భారత టెలిఫోన్ పరిశ్రమలు, పౌర విమానయానం, వివిధ రాష్ట్రాల్లోని డెవలప్‌మెంట్ సెంటర్లు, రక్షణ, ఎన్‌పీఎల్, ఏఐఆర్, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంట్లు, రైల్వే, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, డీఆర్‌డీఓ, టెలీక మ్యూనికేషన్, సాఫ్ట్‌వేర్/ఐటీ, విద్యుత్తు రంగం, హార్డ్‌వేర్ మ్యానుఫాక్చరింగ్, గృహోపకరణాలు, వీఎల్ఎస్ఐ డిజైన్, టెలివిజన్, పరిశోధన- అభివృద్ధి రంగాల్లో వీరికి ఉద్యోగావకాశాలుంటాయి.

వర్తమాన టెక్నాలజీ అయిన ఐఓటీ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్)లో ఈ బ్రాంచిదే అగ్రస్థానం. విద్యుత్తు సంస్థలు, దాదాపు అన్ని రంగాల కర్మాగారాల్లో నియంత్రణ, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో అవకాశాలు దీనికే ఎక్కువగా ఉన్నాయి. యూపీఎస్సీ నిర్వహించే ఇంజినీరింగ్ సర్వీసెస్ నియామకాలు జరిగే నాలుగు బ్రాంచీల్లో ఈసీఈ ఒకటి.

ఉద్యోగాలిస్తున్న ప్రముఖ సంస్థలు: బీఈఎల్, ఈసీఐఎల్, ఇన్‌టెల్, శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్, సోనీ, తోషిబా, ఫిలిప్స్, సెమీకండక్టర్స్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, నోకియా, ఏఎండీ, సిస్కో, హెచ్‌పీ, ఐబీఎం మొదలైనవి ఈసీఈ అభ్యర్థులకు ఉద్యోగాలిస్తున్న ప్రముఖ సంస్థల్లో ప్రధానమైనవి.

ఉన్నత విద్య

ఈసీఈ బీటెక్ కోర్సు పూర్తి చేసినవారు ఎంఎస్/ ఎంటెక్, పీజీ డిప్లొమాలు చేయవచ్చు. మాస్టర్స్ డిగ్రీని పొందడం ద్వారా కెరియర్ అవకాశాలను పెంచుకోవచ్చు. విదేశాల్లో ఎంఎస్ చేయవచ్చు. మనదేశంలో ఎంటెక్‌లో చేరటానికి గేట్‌లో మంచి స్కోరు తెచ్చుకోవాలి. ఈ రంగంలో పరిశోధన- అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు కొన్ని కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. కాబట్టి పీహెచ్‌డీ వైపు వెళ్లినా ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. అమెరికా లాంటి దేశాల్లో ఎంఎస్ లేదా పీహెచ్‌డీ చేయాలంటే జీఆర్ఈ, టోఫెల్ తదితర పరీక్షలు రాయాల్సివుంటుంది.